

పార్కు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన హైడ్రా అధికారులు

తుర్కయాంజాల్‌లో అక్రమ కట్టడం నేలమట్టం

హయత్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తుర్కయాంజాల్ మున్సిపాలిటీ 21వ వార్డు పరిధి సూర్యసాయినగర్ కాలనీలోని 482 గజాల పార్కు స్థలం కబ్జాపై హైడ్రా అధికారులు స్పందించారు. శనివారం హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది పార్కు స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా నిర్మాణదారులు హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయినా పూర్తిగా నేల మట్టం చేసి, వెంటనే ఆ స్థలంలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ బోర్డును నాటారు. ఈ సందర్భంగా సూర్యసాయినగర్ కాలనీ వాసులు హైడ్రా అధికారుల పని తీరును అభినందించారు. కార్యక్రమంలో ఆదిబట్ల సీఐ రవికుమార్, ఎస్ఐ నోయల్ రాజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాచకాలువ పనులు వేగవంతం చేయాలి: సైదులు

వనస్థలిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బృందావన్ కాలనీ, జక్కిడి రామస్వామి కాలనీలోని రాచకాలువ పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు శనివారం సైదులు, జలమండలి మేనేజర్ సిరివెన్నెలతో కలిసి సదరు కాలనీల్లో పర్యటించి రాచకాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీటి సమస్య పరిష్కారానికి ఆక్రమణకు గురైన రాచకాలువను అధికారులు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు జలమండలి మేనేజర్‌ను వివరణ కోరగా సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను సన్మానిస్తున్న నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

నాయకులకు సూచించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

మన్సూరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నాయకులు కృషి చేయాలని హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్ యాదవ్ నివాసానికి మర్యాదపూర్వకంగా దత్తాత్రేయ విచ్చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాజకీయ నాయకులు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాల్లో యువతను భాగస్వాములను చేయాలన్నారు. అనంతరం కార్పొరేటర్ దంపతులకు తాను రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లో ప్రసవం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది నెలల నిండిన గర్భిణికి నొప్పులు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఆమె బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. నగర శివారు ఒడిశాకు చెందిన గుల్సర్ భర్తతో కలిసి పెద్దఅంబర్‌పేట్‌లో ఉంటున్నారు. శనివారం ఆమెకు పురిటినొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. వెంటనే ఆమెను హయత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, నొప్పులు ఎక్కువ కావడంతో 108 టెక్నీషియన్ అమ్జద్ ఆమెకు డెలివరీ చేశారు.



బిడ్డను కుటుంబ సభ్యులకు అందిస్తున్న టెక్నీషియన్

మహిళ ఆత్మహత్యా యత్నం.. కాపాడిన పోలీసులు

వనస్థలిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన గృహిణిని పోలీసులు కాపాడిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ సహారాలో నివాసముండే ఓ గృహిణి(30) తన ఇంట్లో గురువారం అర్ధరాత్రి ఫ్యానుకు ఉరివేసుకోవడానికి యత్నించింది. ఆ సమయంలో అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాంబాబు, డ్రైవర్ నరేష్‌కు సమాచారం అందింది. దీంతో కేవలం 7 నిమిషాలలోనే సదరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గృహిణి ఇంటి తలుపులు పగులగొట్టి ఉరివేసుకుంటున్న మహిళ ప్రాణాలు కాపాడారు. అనంతరం ఆ మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

'అంగన్‌వాడీ' సమస్యలు పరిష్కరిస్తాం

సరూర్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని సుల్తాన్‌పూర్‌లో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ విభాగం అధికారులు పేర్కొన్నారు. ఈ కేంద్రంలోని సమస్యలను ఇటీవల బడంగ్‌పేట్ బీజేపీ శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి స్వయంగా పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఐసీడీఎస్ విభాగం సీడీపీవో రేణుక, సూపర్‌వైజర్ అనిత తదితరులు శనివారం కేంద్రాన్ని సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించారు. దీనిపై సమగ్ర నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని, కేంద్రాన్ని మరో భవనంలోకి తరలించడానికి సైతం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం: కార్పొరేటర్

సైదాబాద్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నూతన రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. శనివారం లక్ష్మీనగర్ కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి, పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనులపై కాలనీ సంక్షేమ సంఘాలు పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్, చంద్రశేఖర్ రెడ్డి, బాలకృష్ణ గౌడ్, నర్సింహమూర్తి, గురు దత్త, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

సైదాబాద్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్‌లో డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కొత్త కాపు అరుణారెడ్డి తెలిపారు. శనివారం జలమండలి మేనేజర్ శ్రవణ్‌కుమార్‌తో కలిసి శంకేశ్వర్ బజార్‌లో నల్లాలలో కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారానికి చేపడుతున్న పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలించారు. ముఖ్యంగా బస్తీలతో పాటు పలు కాలనీలలో లోప్రెషర్ నీటి సరఫరా, మురుగు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మేనేజర్‌ను కోరారు.

రజక సంఘం భవన నిర్మాణ పనులు ప్రారంభం

హయత్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ఓల్డ్ విలేజీలో రూ. 30లక్షలతో నిర్మించ తలపెట్టిన రజక సంఘం భవనం పనులను శనివారం హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి ప్రారంభించి బోరు వేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్‌నగర్‌లో రజక సంఘం భవనం నిర్మించాలని స్థానిక సంఘం నాయకులు ఎన్నికల సమయంలో కోరారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంఘం నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరు చేయించామన్నారు. అన్మగల్ హయత్‌నగర్‌లో ఉన్న అభ్యుదయ యుజన సంఘం భవనం నిర్మాణం పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఏఈ హేమా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గొప్ప నాయకుడిని కోల్పోయాం



కుంట్లూర్ ఆర్ఎస్ఆర్ కాలనీలో నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు



సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సింగరేణి కాలనీ గిరిజన భవన్‌లో నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు



కొత్తపేట చౌరస్తాలో నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు



హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద..

సురవరం మృతిపట్ల విచారం వ్యక్తం చేసిన సీపీఐ నాయకులు

సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి కొనియాడారు. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. శనివారం కుంట్లూర్‌లోని రావినారాయణ రెడ్డి కాలనీ-3 (భూ పోరాట కేంద్రంలో) సురవరం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లె నరసింహ, అజ్మీర్ హరి సింగ్‌నాయక్, శేఖర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, నరసింహ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట చౌరస్తాలో..

ఎల్బీనగర్ : సీపీఐ నేతలు కొత్తపేట చౌరస్తా వద్ద సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాయబండి పాండురంగాచారి, మండల కమిటీ అధ్యక్షుడు పూజారి శ్రీను, రాయబండి అరుణాచారి, కృష్ణమూర్తి, యాదయ్య, సైదులు, నిరంజన్, సద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురవరం చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి

హయత్‌నగర్: సురవరం చరిత్రను పాఠ్యాంశాలలో చేర్పించాలని ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ శేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సుధాకర్‌రెడ్డి మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ హయత్‌నగర్‌లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన మరణంతో సీపీఐ గొప్ప నాయకున్ని కోల్పోయిందన్నారు.

కోహెడలో...

తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడలో సీపీఐ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, చల్ల నారాయణరెడ్డి, నరేందర్‌గౌడ్, అండాలు, జగన్‌మోహన్‌రెడ్డి, బాలకృష్ణ,అంజమ్మ, పద్మ, ముజీబ్, పర్వీన్, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భవన్‌లో..

సైదాబాద్ : సురవరం చిత్రపటానికి సింగరేణి కాలనీ గిరిజన భవన్‌లో పార్టీ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు శంకర్ నాయక్, డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, నేతలు దశరథ నాయక్, రూప్‌సింగ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: కామ్రేడ్ సుధాకర్ రెడ్డి సేవలు మరువలేనివని తెలంగాణ అధ్యయన వేదిక వనస్థలిపురం సమన్వయకర్త కట్టా భగవంత్‌రెడ్డి అన్నారు. ఆయన మృతికి సంతాపంగా వనస్థలిపురంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డీజేలు పెడితే కేసులు తప్పవు

గణేష్ ఉత్సవ సమితి, మండప నిర్వాహకులకు పోలీసుల హెచ్చరిక

దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల నేపథ్యంలో నిబంధనలను అతిక్రమించే వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. పోలీసు అనుమతి లేకుండా ర్యాలీలు, డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు తప్పవని హెచ్చరిస్తున్నారు. రానున్న గణపతి నవరాత్రుల సందర్భంగా ఉత్సవ సమితి, మండప నిర్వాహకులు చేపట్టాల్సిన జాగ్రత్తలు చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు వెల్లడించారు. ఈ సంవత్సరం కూడా డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి, డీజేలు ఏర్పాటు చేస్తే డీజే ఆపరేటర్లు, యజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సరూర్‌నగర్ చెరువు కట్టపై ఏర్పాట్లు

ఎల్బీనగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత కోరారు. శనివారం కొత్తపేట చౌరస్తా సమీపంలోని ఓ కాన్ఫరెన్స్‌హాల్‌లో గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరూర్‌నగర్ చెరువు కట్టపై నిమజ్జనోత్సవానికి ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామన్నారు. 10 మంది గజ ఈతగాళ్లు, 200 సీసీ కెమెరాలు, 1500 వీధి దీపాలు, డబుల్ బారీకేడ్లు, గ్రీన్‌వెస్ట్ తరలించడానికి ప్రత్యే వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అంబులెన్సు, ఒక వైద్యుడు, ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు ఆశా వర్కర్లతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

చాదర్‌ఘాట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి సిమ్లా గార్డెన్‌లో మలక్‌పేట డివిజన్ పరిధిలోని చాదర్‌ఘాట్, మలక్‌పేట, డబీర్‌పుర పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఉన్న ఉత్సవ సమితి నిర్వాహకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

'గణేశ్ ఆగమన్' ఊరేగింపులో డీజే మోత

కేసు నమోదు చేసిన పోలీసులు

సరూర్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి వేడుకల సందర్భంగా మీర్‌పేట్‌కు వినాయకుడి విగ్రహం తీసుకు వస్తున్న ఓ కాలనీ ఉత్సవ నిర్వాహకులు.. గణేశ్ ఆగమన్ పేరుతో డీజే ఏర్పాటు చేసి హంగామా సృష్టించారు. డీజేకు అనుమతి లేకపోవడంతో సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు ప్యాడ్ బ్యాండ్ డీజే వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ వివరాల ప్రకారం.. మీర్‌పేట్ తిరుమలాహిల్స్ కాలనీకి చెందిన ఉత్సవ నిర్వాహకులు శనివారం గణేశ్‌ను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ క్రమంలో డీజే ఏర్పాటు చేసి హంగామా చేశారు. దాంతో తమ సిబ్బంది డీజే వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ప్యాడ్ బ్యాండ్ డీజే వాహనం

ఆజంపురలో రూ.1.52 కోట్లతో అభివృద్ధి పనులు

- రూ.60లక్షలతో ఈ-లైబ్రరీ
- మలక్‌పేట ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లో రూ.1.52 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శనివారం పరిశీలించారు. ఆజంపుర టార్గన్ గ్రౌండ్ ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న జీ+1 భవనంలో రూ.60లక్షలతో ఈ- లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో దాదాపు కంప్యూటర్లతో ఏర్పాటు చేయనున్న ఈ- లైబ్రరీలో కొన్ని మార్పులు చేయాలని ఆయన జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్‌కు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవడానికి వీలుగా ఈ-లైబ్రరీ ఎంతో ఉపయోగపడుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. అదేవిధంగా టార్గన్ గ్రౌండ్‌లో రూ.36లక్షలతో పిల్లలకు క్రీడా పరికరాలు, ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆజంపుర ఓల్డ్ పోస్టాఫీసు నుంచి క్లాక్ టవర్ వరకు రూ.46లక్షలతో సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ మహేష్, హరికల్చర్ ఏఈ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



ఆజంపురలో స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల

భార్యతో గొడవపడి అదృశ్యం

సైదాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీహార్ రాష్ట్రానికి చెందిన అజయ్‌రాయ్(40) భార్యతో కలిసి నగరానికి వలస వచ్చి మాదన్నపేటలో నివాసముంటూ మేస్త్రీ పని చేసుకుంటున్నాడు. ఈ నెల17న భార్యతో గొడవపడి ఇంట్లోనే మొబైల్ పెట్టి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆతడి ఆచూకీ కోసం స్వగ్రామంతో పాటు పలు ప్రాంతాలలో వెతికినా లభ్యం కాలేదు. దీంతో ప్రతిమా దేవి మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అజయ్‌రాయ్ (ఫైల్)

47 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపితే అనూహ్య ప్రమాదాలు చోటు చేసుకుంటాయని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) టీటీఐ అధికారులు, ఇన్‌స్పెక్టర్ రాచపూడి అన్నారు. రాచకొండ పరిధిలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో పట్టుబడిన వారిలో 47 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శనివారం 4 విడతలుగా రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్ హాల్‌లో ఇన్‌స్పెక్టర్ రాచపూడి, ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం మూలంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని మధురాపురి కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను తూర్పుజోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజుల క్రితం రోడ్డు వేసేందుకు రోడ్డును తవ్వి వదిలేయడంతో కాలనీవాసులు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలో నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. అదేవిధంగా రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ద్వారకానగర్ కాలనీలో..

చంపాపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అదనపు వరద నీటి డ్రైన్స్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని సుధీర్‌రెడ్డి అధికారులను కోరారు. హస్తినాపురం డివిజన్ ద్వారకానగర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు.

మన్సూరాబాద్ పరిధిలో..

మన్సూరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యేతో కలిసి జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ పర్యటించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో కలిసి ఆగమయ్యనగర్, కాస్మోపాలిటన్, వీకర్‌సెక్షన్, ఓల్డ్ విలేజ్ కాలనీలకు చెందిన అసోసియేషన్ సభ్యులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా జెడ్సీతో కలిసి ఎమ్మెల్యే ఆయా ప్రాంతాల్లో పర్యటించారు.



మధురాపురి కాలనీలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జోనల్ కమిషనర్

బాల్య వివాహాలను అడ్డుకుందాం

న్యాయమూర్తి శామ్ కోషి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకుని చిన్నారుల భవిష్యత్తును కాపాడుదామని హైకోర్టు న్యాయమూర్తి పి.శామ్ కోషి పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు రంగారెడ్డి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్బీనగర్‌లోని చిత్ర లేఅవుట్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు శామ్ కోషి, అభినంద్‌కుమార్ శవిలి, చలపతిరావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శామ్ కోషి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టపరమైన సమస్య మాత్రమే కాకుండా సామాజిక, మానవతా సమస్య అని అన్నారు. మన చట్టం ప్రకారం బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాల వయసు నిండకముందే వివాహం చేయడం నేరమన్నారు. ఈ సందర్భంగా పుట్టుకతోనే డయాబెటిస్‌తో బాధపడుతూ ఒక కాలును కోల్పోయిన లిఖిత అనే బాలికకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో వీల్ చెయిర్ అందజేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లిఖితకు రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పారాలీగల్ వలంటీర్లకు వారి సేవలను గుర్తిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఇన్‌చార్జి కార్యదర్శి వాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీసీపీ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బాలికకు వీల్ చైర్ అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శామ్ కోషి



పెద్దచెరువు వద్ద సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న సబితారెడ్డి

సుందరీకరణతో పెద్దచెరువుకు కొత్త కళ

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలతో మీర్‌పేట్ పెద్దచెరువు వద్ద చేపట్టిన సుందరీకరణ పనులతో చెరువుకు కొత్త కళ రానున్నదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శనివారం ఆమె పలువురు అధికారులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి చెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెరువుల సుందరీకరణ కోసం పెద్ద మొత్తంలో నిధులు తీసుకువచ్చామని, ప్రస్తుత ప్రభుత్వం నిధులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు మాజీ సీఎం కేసీఆర్ ఒక్కో మునిసిపాలిటీకి రూ.50కోట్ల చొప్పున స్పెషల్ ఫండ్ మంజూరు చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సదరు నిధులను ఆపేసిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన నిధులతోనే చెరువుల సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని, ఇదంతా కేసీఆర్, కేటీఆర్ చలువేనని ఆమె అన్నారు. మీర్‌పేట్ పెద్దచెరువు సుందరీకరణ పనుల్లో తాత్సారం జరుగకుండా చూడాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్, తదితరులు ఉన్నారు.



జిల్లెలగూడ బాలాజీని దర్శించుకున్న పారిజాతారెడ్డి తదితరులు

బాలాజీని దర్శించుకున్న మాజీ మేయర్

సరూర్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి రోజుతో పాటు అమావాస్య సందర్భంగా శనివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలోని శ్రీమత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఇక్కడ స్థానిక అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతి పురాతనమైన జిల్లెలగూడ బాలాజీ దేవాలయం స్థల మహత్తు ఎంతో గొప్పదని అన్నారు. ఇది శాశ్వత ఉత్తర ద్వారం కలిగిన దేవాలయం కావడం భక్తుల అదృష్టమని ఆమె పేర్కొన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది: భగవత్ జీ

చంపాపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో గొప్పదని శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద కమిటీ చైర్మన్ దండేటికార్ భగవత్ జీ అన్నారు. చంపాపేటలోని శ్రీ నల్ల, ఎర్ర పోచమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం అమావాస్యను పురస్కరించుకొని 500 మంది పేదలకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి పాలక మండలి సభ్యులు, కీర్తనాచార్యులు ఉషశ్రీ, పల్లవి, విజయశ్రీ అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవి ముదిరాజ్, సుశీల్‌కుమార్, సాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలి'

కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపైనా, బీఆర్ఎస్ శ్రేణులపైనా జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గంజాయిబ్యాచ్ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆరోపిస్తూ ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎల్బీనగర్ యువజన విభాగం నాయకులు శనివారం ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు.

పాస్టర్ ప్రశాంత్‌కుమార్‌కు డాక్టరేట్

కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మోహన్‌నగర్‌కు చెందిన పాస్టర్ ఎల్.ప్రశాంత్‌కుమార్ బిబ్లికల్ థియోలజీలో డాక్టరేట్ సాధించారు. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ చర్చ్ మేనేజ్‌మెంట్ వారు చెన్నై వండలూరులో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

ఏపూరి సోమన్నకు ఉద్యమకారుల ఫోరం వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం నాయకులు శనివారం బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్నను కలిశారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగే విష్ణువర్ధన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమకారులు సోమన్నకు వినతి పత్రం అందజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన ఇంటి స్థలాల కేటాయింపు హామీలను వెంటనే అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.